# గుడ్డి కన్ను

"భగవంతుడు మనిషికి కూడా మొక్కల్లాంటి ఏర్పాటు చేస్తే బాగుండేదిరా!" అన్నాడు రంగనాథం.

"అంటే?" అన్నాను.

"విత్తనం నాటేకగానీ, మొక్క పాతేకగానీ కొన్నాళ్ళపాటు నీళ్ళు పోసి సంరక్షిస్తే చాలు..వాటి మానాన అవి బ్రతగ్గలుగుతాయి. ఎండ, గాలి, నీరు కలుపుకుని తమక్కావలసిన ఆహారాన్ని సంపాదించుకుంటాయి. మనిషి విషయం అలా కాదు. కొంతకాలం పాటు వాణ్ణి తల్లిదండ్రులు పోషించినా తర్వాత వాడు సమాజం మీద ఆధారపడి బ్రతకాల్సిందే" అన్నాడు రంగనాథం.

రంగనాథం బాధ నాకు తెలుసు. వాడికి ఉద్యోగం కావాలి. వాడు తెలివైనవాడే! ఎమ్మే సైకాలజీ చదివాడు. అందులో యూనివర్సిటీ ఫస్టు కూడా వచ్చాడు. ప్రొఫెసర్‌తో కనుక మంచిగా ఉండి, ఆయన కనుగుణంగా మసులుకుని ఉంటే డిపార్ట్‌మెంట్లోనే ఉద్యోగం సంపాదించుకోగలిగి ఉండేవాడు. కానీ అది చేతకాక రెండేళ్ళుగా నిరుద్యోగిగా ఉంటున్నాడు.

"మొక్కలకూ, మనకూ చాలా తేడా ఉంది. మనకు మెదడు ఉంది. కదిలే శక్తి ఉంది. ఈ రెండూ ఉపయోగించడం వల్లనే మొక్కలకు లేని సమాజం మనకు ఏర్పడింది. ఈ సమాజమే మనని రక్షిస్తోంది" అన్నాను.

నేనూ, రంగనాథం చిన్నప్పట్నించీ కలిసి చదువుకున్నాం. హైస్కూలు తర్వాత

క్లాసులు విడిపోయినా ఒకే కాలేజీలో చేరాం. నేను బియస్సీకి అప్లై చేసి, ఓ రెండు నెలలు యూనివర్సిటీలో చదివాను కూడా. ఈలోగా ఓ ఆడపిల్ల తండ్రి ప్రయత్నఫలంగా నాకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగాన్ని స్వీకరించి చదువుకు స్వస్తి చెప్పాను. ఉద్యోగాన్ని వరమాలగా వేసిన చంద్రికను పెళ్ళి చేసుకున్నాను. నాకు బ్యాంకులో ఉద్యోగం వచ్చిందని బి.కాం. చదువుతున్న నా స్నేహితులు నలుగురు అసూయపడ్డారు. ''బ్యాంకు ఉద్యోగం కావాలనుకున్నవాడివి బి.కాం.లో చేరక బి.యస్సీ.లో ఎందుకు చేరావు? గవర్నమెంటు నీ సైన్సు ట్రయినింగుకు చేసిన ఖర్చు వృథాయే కదా?''అని వాళ్ళు నాతో అంటే, నేను నవ్వి, ''ఉద్యోగం కోసం చదువుకున్నాను. వచ్చింది. జీతమే నాకు ముఖ్యం. అంతే!'' అన్నాను.

పైకి అలా అన్నప్పటికీ, నా మనసులో ఏ మూలో కలుక్కుమనకపోలేదు. 'అసలు మనం చదివే చదువు ఎందుకు? నిత్య జీవితంలో అది ఏ విధంగా సహకరిస్తుంది?' అన్న విషయాలు తరచి తరచి ఆలోచిస్తే భయం వేస్తుంది. వీటికి జవాబుగా, ఉపశమనంగా రంగనాథం కొంతవరకూ నాకు సహకరిస్తున్నాడు. వాడు ఎమ్మే సైకాలజీ చదివి, ఆ సబ్జక్టుకు సంబంధించిన ఉద్యోగాల కోసమే ప్రయత్నిస్తున్నాడు. ఎటోచ్చీ రెండు సంవత్స రాలైనా వాడి ప్రయత్నాలు ఫలించలేదు.

''నీకేంరా..ఉద్యోగం దొరికింది. నీడ పట్టున ఉన్నావు కాబట్టి సమాజాన్ని పొగుడుతావు. కనీసం ఉద్యోగం దొరికే వరకైనా నాకు సమాజం నచ్చదు'' అన్నాడు రంగనాథం నవ్వుతూ.

వాడికిప్పుడు రెండాశలు మిగిలి ఉన్నాయి. ఒకటి..వాళ్ళ మామయ్య - మామయ్యంటే తల్లికి స్వయానా తమ్ముడు కాదు, ఏదో దూరపు బంధుత్వం. కానీ ఆయనకు బంధుప్రీతి ఎక్కువట. ఆయన తల్చుకుంటే రంగనాథానికి ఏదైనా కంపెనీలో లేబర్ వెల్ఫేర్ ఆఫీసర్ లాంటి ఉద్యోగం ఇప్పించగలడు. ఆయనకున్న బంధుప్రీతి అనే బలహీనతను వాడిప్పుడు ఎక్స్ప్లాయిట్ చేయవలసి ఉన్నది. అందు గురించి వాడు చాలా పథకాలు వేస్తున్నాడు.

రంగనాథం రెండో ఆశ - మా ఊరి ఎమ్మెల్యే. రంగనాథమంటే ఆయనకు చిన్నప్పట్నించీ ఇష్టం. ఆయన తల్చుకుంటే మా ఊరి కాలేజీలో సైకాలజీ బ్రాంచి ప్రారంభించి - వీడికి లెక్చరర్ ఉద్యోగం ఇప్పించగలడు. అందుకాయన సంసిద్ధుడు. వీడాయన్ను బాగా కాకాపట్టి - సైకాలజీ ప్రాముఖ్యాన్నాయనకు వివరించి నచ్చ చెప్పాలి. అంతా వీడిలోనే ఉంది. ఈ విషయంలో కూడా రంగనాథం ఎన్నో పథకాలు వేస్తున్నాడు.

నేనూ, రంగనాథం కబుర్లు చెప్పుకుంటూండగా ఒక కోయవాడు మా ఇంటి ముందు ఆగాడు. నన్ను చూస్తూనే...''ఉత్తరం కోసం ఎదురుచూస్తు న్నావు. ఈ వారంలోనే తప్పక వస్తుంది. అనుకున్న పని జయమవుతుంది'' అన్నాడు.

నేను ఆశ్చర్యపడి...''అనుకున్న పని జయమైతే నీకు మంచి బహుమతి ఇస్తాను'' అన్నాను.

కోయవాడింకో రెండడుగులు ముందుకేసి ఇంటి అరుగు మీద చతికిలబడి నా చేయి

చూపించమన్నాడు. చూపించాను. గతంలో ఎరిగినవి ఎన్నో చెప్పి వాడు నన్నాశ్చర్యపరిచాడు. నాకు అన్నీ బాగానే ఉన్నవనీ, కానీ చిన్న గ్రహం ఒకటి అడ్డు తగలడంవల్ల అప్పుడప్పుడు అనుకోని ఆటంకాలు వస్తున్నాయనీ తనకు పాతిక రూపాయలు ఇస్తే పూజ చేసి ఆ దుష్ట గ్రహాన్ని వదలగొడతాననీ అన్నాడు. నేను వాడితో బేరానికి దిగాను.

"వాడు నీ బలహీనత కనిపెట్టాడు. వాడితోటి బేరాలేమిటి? పంపించేయ్" అన్నాడు రంగనాథం.

"లేదు, వాడు చెప్పినవన్నీ నిజాలే!" అన్నాను.

"నిజాలే చెబుతాడు. అదేం కష్టం కాదు. ఏకాగ్రతతో ఎదుటివాడి ఆలోచనలను చదవవచ్చు. థాట్ రీడింగ్ గురించి నీకూ తెలుసు కదా! వాడు చేస్తున్న పని అదే. నాకు జోస్యం చెప్పమని అడుగుతాను. చెబుతాడేమో చూద్దాం" అన్నాడు ఇంగ్లీషులో.

"సరే, అలాగే చెయ్" అన్నాను.

రంగనాథం తన చేయి చాపి జోస్యం చెప్పమన్నాడు. కోయవాడు ఒప్పుకోలేదు. శుభం జరిగేటప్పుడే వాడి దేవత పలుకుతుందిట. అశుభాన్ని పలకనివ్వదుట.

రంగనాథం నవ్వి, " నేను నా ఆలోచనలను స్థంభింపచేశాను. అందుకే వాడలా అంటున్నాడు" అన్నాడు నాతో ఇంగ్లీషులో.

నేను కోయవాడి చేతిలో ఓ రూపాయి పెట్టి మళ్ళీ ఎప్పుడైనా రమ్మనమని చెప్పాను. వాడు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

"బ్రతుకుతెరువు కోసం వాడేవో అంటాడు. చదువుకొన్నవాడివి నువ్వు నమ్మడం బాగోలేదు" అని వెళ్ళిపోయాడు రంగనాథం.

జరిగిన విషయాన్ని తరువాత నా భార్యకు చెప్పాను నేను. చంద్రిక చాలా కంగారుపడిపోయి, "ఈ మధ్య నేనూ చూస్తున్నాను. మనకు ప్రతి పనికీ ఏదో ఆటంకం వస్తేకానీ అవటం లేదు. వాడు నిజమే చెప్పాడు. ఆ పూజ ఏదో చేయించవలసింది" అంది.

"వాడి మాటలు ఎలా నమ్మేది? రంగనాథం వాడికి జోస్యం తెలియదని ఋజువు చేశాడు" అన్నాడు.

"ఏం ఋజువు చేశారండీ. మీ వెర్రిగానీ, ఆయనకు అశుభం ఉన్నదని కదా వాడు చెప్పాడు. బహుశా ఉద్యోగం కోసం ఆయన ఇప్పుడు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవేమో, కోయవాళ్ళు సాధారణంగా అశుభాలు చెప్పరు" అంది చంద్రిక.

"అలా అనకు చంద్రీ!" అన్నాను. కోయవాడు కూడా చెప్పడానికి ఇష్టపడని అశుభాన్ని చంద్రిక ఊహించడం నాకు నచ్చలేదు.

నేనాట్టే విచారించనవసరం లేకుండానే కోయవాడు మళ్ళీ మా ఇంటికి వచ్చాడు. వాణ్ణి చూస్తూనే మా ఆవిడ ముఖం ఇంతయింది. వాడు ఆమెకు సంబంధించిన అనేక అద్భుత విషయాలు చెప్పాడు. వాడికి నిజంగానే జోస్యం వచ్చుననీ, అది థాట్ రీడింగ్ కాదని నమ్మాలనీ నాకు అనిపించింది. ఎందుకంటే మా గురించి వాడు చెబుతున్న మాటలు

అంత తియ్యగా ఉన్నాయి.

"ఇందాకా నిన్ను పంపించేశానుగా, మళ్ళీ వచ్చావేం?" అన్నాను నేను తేరుకుని.

నమ్మకంలేని వాళ్ళ వద్ద దేవత పలకదట. నాకు నమ్మకం ఉందని వాడికి రూఢి అయింది. నాకూ, నా భార్యకూ జోస్యం చెప్పాలని వాణ్ణి దేవత బలవంత పెడుతున్నదట. ఏ పనీ మాకు ఆటంకం లేనిదే జరుగడం లేదట. ఆఖరికి గ్రహశాంతి కోసం పూజ చేయాలనుకుంటే కూడా ఇందాకా రంగనాథం రూపంలో ఆటంకం వచ్చిందిట.

వాడి మాటలు నిజమేననిపించాయి. అయిదు రూపాయలకు బేరం కుదిర్చి, వాడిచేత అవసరమైన పూజ చేయించాం. మా ఇద్దరికీ చెరో తాయెత్తూ ఇచ్చి చేతికి కట్టుకోమనీ, ఒక సంవత్సరం పాటు ఆ తాయెత్తు పోకుండా భద్రంగా చూసుకోమనీ వాడు చెప్పాడు. మరో రెండు రూపాయలు ఎక్కువే ఇచ్చాము వాడికి.

"అత్తయ్యా, మామయ్యా కూడా ఉంటే బాగుండే దండీ! వాళ్ళు కూడా చెప్పించుకునేవారు" అంది చంద్రిక.

నా తల్లిదండ్రులిద్దరూ ఊళ్ళో లేరు. తిరుపతి వెళ్ళారు. అలా వెళ్ళడం వారికి కొత్త కాదు. ఏటా ఒకసారి అలా వెళ్ళి వస్తూంటారు. అందుక్కారణం అపరిమితమైన దైవభక్తి కాదు. అన్నయ్య కారణంగా కలిగిన అవసరం.

మా ఇంట్లో నాకూ, అన్నయ్యకూ చాలా తేడా ఉంది. అమ్మకూ, నాన్నకూ, అన్నయ్య సమస్య, నేను పరిష్కారం. చిన్నప్పట్నించీ నేను ఎంతో బుద్ధిగా చదువుకుంటూ అన్నయ్య ఆగమ్మ కాకిలా తిరిగే వాడు. మెట్రిక్ కూడా ప్యాసు కాలేదు వాడు. కానీ వాడికి ఊళ్ళో పెద్ద పెద్ద వాళ్ళ పరిచయాలున్నాయి. పెద్ద పెద్ద వాళ్ళ పిల్లలు ఎక్కువగా వెడుతూండే చోట్లకే వాడూ వెడుతూండడం అందుక్కారణం. వాడు చదువుకోకుండా తిరుగుతున్నందుకు అమ్మ బాధ పడేది. అయితే వాడి వాక్చాతుర్యం చాలా గొప్పది. వాడి ప్రక్కన ఉన్నంత సేపూ ఈ ప్రపంచంలో సంతోషం తప్ప ఇంకేమీ లేదనిపిస్తుంది. అందుకే వాడి స్నేహితులంతా వాడి సమక్షాన్ని కోరుకుంటారు. మా బంధువులమ్మాయి ఒకామె వాణ్ణి కోరి చేసుకుంది. లేకపోతే వాడసలు ఇంటివాడయ్యేవాడు కాదేమో!

అన్నయ్య దగ్గర లేనప్పుడు వాడొట్టి జులాయి వాడనీ, వాడికంటే నేను ఎన్నో రెట్లు గొప్ప వాడిననీ అనుకుంటాను. వాడు దగ్గరున్నప్పుడు మాత్రం నేను చాలా తక్కువ వాడిలా ఫీలవుతుంటాను. ఎందుకంటే అన్నయ్య ప్రక్కన ఉంటే జనం ఇంకెవరినీ పట్టించుకోరు. అందరి దృష్టీ వాడి మీదా, వాడు చెప్పే కబుర్ల మీదా ఉంటుంది. వాడికిలా మనుషుల్ని ఆకట్టుకునే శక్తి నాకు లేదు. అన్నయ్య నా గురించి అసూయ పడుతున్నాడో లేదో కానీ, వాడి గురించి అప్పుడప్పుడు నేను అసూయ పడుతుంటాను. ఇప్పటికీ వాడు నన్ను గురించి అంటూనే ఉంటాడు.." ఎందుకురా, ఇంత చిన్న వయసులో ఈ ప్రపంచంలో బాధలన్నీ నీవే అన్నటు సీరియస్‌గా ఉంటావు? ఈజీ గోయింగ్ ఉండాలి."

అన్నయ్య కుద్యోగం లేదు. ఎలా సంపాదిస్తాడో కానీ అప్పుడప్పుడు డబ్బు సంపాదిస్తాడు.

తన దగ్గర డబ్బున్నప్పుడు ఇంట్లో అందరికీ ఎన్నో కొంటాడు. లేనప్పుడు నిర్మొహమాటంగా ఇంట్లోనే అడిగి తీసుకుంటాడు.

వదిన ఏడాదికి ఆరు నెలలలు పుట్టింట్లో ఉంటుంది. వదిన పుట్టింటివారు కాస్త కలిగినవారే. అన్నయ్య ఇంటి పట్టున ఉండడని వదిన తరచుగా బాధపడుతూంటుంది. వాణ్ణి ఎన్నో అనాలనుకుం టుంది. కానీ వాడు ఇంటి పట్టున ఉన్నప్పుడన్నీ మరచిపోయి ఆరాధనలో పడిపోతుంది. మనుషుల్ని ఎలా మాయలో పడేస్తాడో ఏమిటో అన్నయ్య!

నేను బుద్ధిగా సంసారం చేసుకుంటున్నా చంద్రికకు నాపై కోపం వస్తూనే ఉంటుంది. ఆమెకు కోపం ఎందుకు వస్తుందో, దాన్నెలా పోగొట్టాలో తెలియక నేను సతమత మవుతూంటాను. అప్పుడప్పుడు మేమిద్దరమూ గొడవలు పడి, రెండు మూడు రోజులు మాట్లాడుకోని సందర్భాలు కూడా ఉన్నా యి.

అన్నయ్యలో ఎన్ని అవలక్షణాలున్నా వాడెప్పుడు ఎవరిచేతా మాట పడలేదు. మాట పడవలసి వచ్చినా, ఇంకొకరి సాయం అవసరం లేకుండా తనే సర్ది చెప్పుకునేవాడు. చిన్నపుడు వాడెన్ని తప్పులు చేసినా వాణ్ణి అమ్మా, నాన్నా క్షమించగలిగేవారు. నేను పెన్నైనా, పెన్సిలేనా పారేసుకువస్తే, ''వాడెలాగూ వెధవే! నీకేమొచ్చిందిరా?'' అని తిట్టేవారు. అలాం టి సందర్భాల్లో అన్నయ్యే నన్ను ఆదుకునేవాడు. ఒకోసారి తప్పులను వాడే తన పైన వేసుకునే వాడు. అటువంటి త్యాగబుద్ధి నాకు ఉండేది కాదు. ఇటీవల వాడొకసారి నాకూ, చంద్రికకూ గొడవొస్తే సర్ది చెప్పాడు.

వాణ్ణి నేనో పర్యాయం అడిగేశాను కూడా, ''ఎవరికీ నచ్చని పనులు చేస్తూ అందరి అభిమానాన్నీ ఎలా పొందగలుగుతున్నా''వని.

వాడు నవ్వి, ''ఎదుటివాళ్ళ మనస్తత్వం తెలుసుకుంటే చాలు.. హాయిగా బ్రతకొచ్చు. మనం తప్పులు చేశామని ఎవరికీ బాధ ఉండదు - ఎదుటి వాళ్ళకు బాధ కలిగించనంతకాలం. ఉదాహరణకు నీ విషయమే తీసుకుందాం. నీ తప్పు ఒకటి నా మీద వేసుకున్నాననుకో, నా కెలాగూ నష్టం లేదు. చెడ్డవాణ్ణన్న పేరుండనే ఉంది. ఆ నా చిన్న త్యాగం నీకు నాపై గౌరవాన్నీ, అభిమానాన్నీ కలిగిస్తుంది. అందువల్ల నా తప్పులు చాలా వరకూ క్షమించ గలుగుతావు. నీకులా నా ప్రవర్తనకు హద్దులు లేవు. ఏ పరిస్థితుల్లోనూ మాటలతో ఎదుటి మనిషికి నొప్పి కలగకుండా ఉండేలా చూసుకుంటాను. రెండు పొగడ్తలకు రెండు వందల తప్పులు క్షమించబడతాయి'' అన్నాడు.

వాడు చెప్పింది నిజమేననిపించింది. కానీ నా కది ఆచరణయోగ్యం కాదు. నాకు ఎవరి మీదనైనా కోపం ఉంటే వాళ్ళను చూసి నవ్వను కూడా నవ్వ లేను. మనసులో కుళ్ళు ఉండడంవల్ల పైకి సంతోషంగా కనబడలేను. పొరపాటున కూడా నేను తప్పులు చేసే మనిషిగా ఎవరి చేతనూ గుర్తింపబడడానికి అంగీకరించను. అందుకే అన్నయ్య త్యాగాల నప్పుడప్పుడు ఉపయోగించుకొంటాను.

అన్నయ్య అందరికీ సమస్యగానే ఉండిపోయినా వాడికే సమస్యలూ ఉన్నట్లు లేదు. వాడి సమక్షంలో అందరూ అన్ని సమస్యలూ మరిచి పోతారు కూడా. అయితే వాడు

లేనప్పుడు అమ్మ వాడి గురించి ఏడుస్తుంది. వాడి కోసమే అమ్మా నాన్నా ఏటా ఒకసారి తిరుపతి వెళ్లి వస్తూంటారు. వాణ్ణి నలుగురూ నడిచే దారికి మళ్ళించమని ఆ స్వామికి ప్రతీ ఏటా విన్నవించు కొంటూంటారు. ఈ సంవత్సరం కూడా వాళ్ళిప్పుడలాగే తిరుపతి వెళ్ళారు. వదిన పుట్టింట్లో ఉంది. రెండు నెలల క్రితం అమ్మకు మంచి మాటలు చెప్పి 15 వందలు తీసుకు వెళ్ళాడు అన్నయ్య. ఆ తర్వాత వాడి ఐపు లేదు. ఇది వాడికి మామూలే!

అన్నయ్య 15 వందలు అడిగినప్పుడుఅమ్మ ఇంట్లో అందర్నీ సంప్రదించింది. వాడికి డబ్బు ఇవ్వరాదని అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే వాడు మళ్ళీ మర్నాడు అడిగినప్పుడు నేను 400, నాన్నగారు 800, వదిన తన దగ్గర దాచుకున్నది 200, అమ్మ ఒక వందా కలిపి వాడికి మనస్ఫూర్తిగా 15 వందలూ ఇచ్చాము. అది పుచ్చుకొని వాడు వెళ్ళిపోయాక అలా చేయవలసినది కాదని అనుకున్నాము. వాడి జాడ తెలీకుండా పోయాక వదిన పుట్టింటి కెళ్ళింది. అమ్మా నాన్నా తిరుపతి వెళ్ళారు. మా అందరి మూలంగానే అన్నయ్య అలా తయారవుతున్నాడని నా భార్య నన్ను నానా మాటలూ అన్నది. ఆ విధంగా నేను పడ్డ మాటలు అన్నయ్య జీవితంలో ఎన్నడూ పడి ఉండడు. అది వాడి అదృష్టం మరి.

కోయవాడి జోస్యం అయ్యాక ఆ రోజు సాయం త్రం నేనూ, మా ఆవిడా కలిసి బీచికి వెళ్ళాం. ఇలా మేమిద్దరం కలిసి బీచికి వెళ్ళడం అరుదు. అమ్మా, నాన్నా ఇంట్లో ఉండగా భార్యతో షికారు వెళ్ళడానికి నేను మొహమాటపడతాను. సాధారణంగా ఎప్పుడు బయటకు వెళ్ళినా అమ్మా, నాన్నాలను కూడా తీసుకువెడతాను. నా మొహమాటాన్ని అమ్మ ఇంకో విధంగా అర్థం చేసుకుంది. నాకు చాలా సిగ్గు అనీ, మెత్తని వాడిననీ అమ్మ అనుకుంటుంది తప్పితే నేను తనకిస్తున్న ప్రిఫరెన్స్ గుర్తించదు. పెళ్ళి కాగానే పెళ్ళాం ఎక్కువైపోయింది అని అమ్మ అనుకోకూడదని నా కోరిక. అమ్మ ఊళ్ళో లేకపోయినా షికార్లకు ఎక్కువగా వెళ్ళను. ఎందుకంటే పొరుగింటి వాళ్ళూ, ఎదురింటి వాళ్ళూ ఆ విషయం అమ్మకు చెబితే అమ్మ ఏమనుకుంటుంది? తను ఎప్పుడు ఊరు వదిలిపెడుతుందా, అని ఎదురుచూస్తున్నాననీ, తను వెళ్ళగానే షికార్లకు పోతున్నాననీ అమ్మ అనుకుంటుందేమోనని భయపడి నేను చాలా అరుదుగా భార్యను తీసుకుని షికారు వెడతాను.

అన్నయ్య ఇలాంటివేమీ పట్టించుకోడు. పెళ్లాంతో షికారుకి వెళ్ళడానికి ఒకరి పర్మిషనేమిటంటాడు.ఎవరో,ఏదో అనుకోవడమేమిటంటాడు. వాడి ఇష్టం వచ్చినట్లు వాడు మసలుతాడు. అయినా వాడికి వచ్చిన చెడ్డపేరూ లేదు, నా కొచ్చిన మంచి పేరూ లేదు. తన ప్రవర్తనతో ఎదుటి వారిని కన్విన్స్ చేయగల తెలివితేటలు అన్నయ్యకున్నాయి.

ఏమైతేనేం..ఇద్దరం కలిసి బీచికి వెళ్ళాం. భార్యతో కలిసి సముద్రపుటొడ్డున నడుస్తూంటే నాలో రక రకాల ఆలోచనలు వస్తూంటాయి. చూసే జనం మా జంటను చూసి ఏమనుకుంటున్నారు? నా భార్య చాలా అందంగా ఉంటుంది. మగవాళ్ళెవరికైనా ఆమెను చూడగానే మనసు చలిస్తోందా?

ఇద్దరం నడుస్తూంటే చంద్రిక చక్కగా కబుర్లు చెబుతుంది. కానీ నేనవి వినను. నా దృష్టి అంతా ఇతరులపైనే ఉంటుంది. వాళ్ళంతా ఒక్కటై నన్నూ, నా భార్యనూ

గమనిస్తున్నారనిపిస్తుంది. నేను సరిగ్గా మాట్లాడనని చంద్రిక విసుక్కుంటుంది.

నాలో రేగినట్లు అందరిలోనూ ఆలోచనలు రేగుతాయా? నేను చదువుకోవడమేనా ఈ ఆలోచనలకు కారణం? అన్నయ్య ప్రవర్తనకూ, నా ప్రవర్తనకూ చదువు ఒక్కటేనా తేడా? చదువుకున్న వాళ్ళంతా నాలాగే ఆలోచిస్తారా?

ఇంకా ఏమాలోచిద్దునో గానీ, బక్కచిక్కిన ముష్టివాడి పలకరింపు నా ఆలోచనలను భంగపరిచింది. "పది పైసలిప్పించండి బాబయ్యా!" అన్నాడు వాడు.

బిచ్చగాళ్ళంటే నాకు ఏవగింపు. వాళ్ళను ప్రోత్సహించడం నాకే మాత్రమూ ఇష్టముండదు. పేదరికాన్ని అడ్డుగా పెట్టుకున్న సోమరులు వీళ్ళని నా అభిప్రాయం. ఎప్పటిలాగే వాడికి ఏమీ ఇవ్వనని చెప్పేశాను. తర్వాత నాలుగడుగులు ముందుకువేసి ఇద్దరం ఇసుకలో కూర్చున్నాం. ముష్టివాడి స్వరం మళ్ళీ విన్పించింది.

"అవతలకు పొమ్మని చెప్పానుగా!" అన్నాను విసుగ్గా.

వాడు కదలకుండా అలాగే నిలబడి నాకేసి చూస్తున్నాడు. ఆ చూపుల్లో ఆశ, జాలి, రెండూ ఉన్నాయి. వాడి వాటం చూస్తే వదిలేలా లేడు.

రోడ్డుమీదెవరైనా ముష్టివాడు తటస్థపడితే లేదని చెప్పి ముందుకు పోవచ్చు. ఇంటి దగ్గరైతే తలుపులు వేసెయ్యొచ్చు. కానీ బీచి దగ్గర ఎలా? మేమిద్దరమూ కూర్చుని ఉన్నాం. బక్కచిక్కిన దేహంతో మాసిన బట్టలతో దరిద్ర దేవత అవతారంలా ఉన్నాడు వాడు.

"పొమ్మనమని చెబితే పోవేం?" అన్నాను నేనే మళ్ళీ విసుగ్గా.

"పది పైసలిప్పించండి బాబూ! రెండు రోజుల్నించి తిండి లేదు" అన్నాడు బిచ్చగాడు, తను అడిగినదింకా ఇవ్వలేదని నాకు గుర్తు చేస్తూ.

"వీడు మనని వదిలేలా లేడు. పది పైసలిచ్చి పంపించండి" అంది చంద్రిక మెల్లగా నాతో.

"అదే వాడి ఎత్తు కూడా. పట్టుదల వాడికే కాదు. మనకూ ఉంటుంది. ఈ మొండి వాడికివ్వ డానికి వీల్లేదు" అంటూ శ్రీమతితో కబుర్లు ప్రారంభించాను. కానీ నా మనసు ఆ బిచ్చగాడి చుట్టూ మాత్రమే తిరుగుతోంది. వాడలా ఎదురుగా నిలబడి ఉంటే శ్రీమతితో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. శ్రీమతి చెప్పే కబుర్లు సరిగ్గా వినలేకపోతున్నాను. వాడు మాత్రం నిశ్చింతగా అలా నిలబడి ఉన్నాడు.

వాణ్ని తిట్టాను. కసిరాను. ఎన్ని అన్నా వాడు పడ్డాడు. నన్ను పల్లెత్తు మాట అనలేదు. అప్పుడప్పుడు మాత్రం తన పది పైసల పాట వదల్లేదు.

నాకు చాలా ఇబ్బందిగా ఉంది. జనమంతా మా ముగ్గురికేసే చూస్తున్నట్లు అనిపిస్తోంది. మేము లేచి వెడుతూంటే వాడు మా కూడా వస్తూం టే అదొక ప్రహసనంలాగుంది.

"వీడు మనస్థిమితం లేకుండా చేస్తున్నాడు. ఇంక ఇంటికి పోదాం" అన్నాను.

"బాగుంది, పది పైసల కోసం రాక రాక వచ్చిన బీచి నుంచి వెళ్ళిపోలేం. పడేయండి వాడి ముఖాన"అంది చంద్రిక విసుగుదలతో.

"ఇలా అయితే ఈ ముష్టాళ్ళందరూ మనల్ని లోకువ కట్టేస్తారు" అన్నాను.

"ధర్మ ప్రభువులు బాబయ్యా! మీరు విసిరేసిన సిగరెట్టు విలువ చేయదు నా బ్రతుకు. ఒక్క పది పైస లిప్పించి పుణ్యం కట్టుకోండి బాబయ్యా" అన్నాడు బిచ్చగాడు.

చివరకు తప్పలేదు. శ్రీమతి సూచనను పాటించి ఓ పది పైసల బిళ్ళ వాడి వైపు విసిరాను. అది తీసుకుని మా ఇద్దరికీ పడి పడి దణ్ణాలు పెడుతూ వెళ్ళిపోయాడు వాడు.

"మొత్తంమీద సాధించాడు - పొమ్మంటే పోకుండా" అన్నాను నేను.

"పొమ్మనగానే పోతే, వాడికి డబ్బులెలా దొరుకుతాయండీ" అంది చంద్రిక.

"అవుననుకో, వాడు మననే అంటిపెట్టుక్కూర్చున్నాడు గదా! మనమేమీ ఇవ్వలేదనుకో - ఈ సమయం అంతా వృధాయేగదా! ఇంకొకళ్ళ నెవరినైనా చూసుకుంటే సరిపోయేది."

"బాగుందండీ, ఇచ్చేదెవరో, ఇవ్వందెవరో మనుషుల ముఖాలు చూడగానే తెలుస్తుంది వాళ్ళకి. ఇవ్వని వాళ్ళ దగ్గర కూడా బిచ్చం సంపాదించుకునే తెలివి తేటలు వాళ్ళకున్నాయి. ఎన్నన్నా సిగ్గు పడరు. ఎన్ని తిట్టినా మనని పొగుడుతూనే ఉంటారు,. జాలిగా చూస్తారు. మనల్ని ఇబ్బందిలో పెట్టేస్తారు. ఎలాగో వాళ్ళ డబ్బు సంపాదించుకుంటారు..." అంది చంద్రిక.

నిజమేననిపించింది నాకు. తర్వాత అక్కడ కాసేపు గడిపి ఇంటికి వెళ్ళిపోయాం.

తర్వాత మూడు వారాలకు రంగనాథం మా ఇంటికి వచ్చాడు. "ఆ దిక్కుమాలిన కోయవాడు అన్నట్టే జరిగింది. నాకున్న రెండు ఆశలూ ఆడియా శలై పోయాయి" అన్నాడు.

జరిగింది క్లుప్తంగా చెప్పాడు. రంగనాథం మామయ్య వీడిని చూసి ఏ మాత్రమూ ఇంప్రెస్ కాలేదుట. వీడి కుద్యోగం ఇప్పించడం తన వల్ల కాదని స్పష్టంగా చెప్పేశాడుట. మా ఊరి ఎమ్మెల్యే గారైతే, "చూశాం కదయ్యా! నీకే ఉద్యోగం దొరక్క ఛస్తుంటే ఈ సైకాలజీ సబ్జక్టు మనూళ్ళో మరి కొంత మందికి తగిలించడమెందుకు?" అనేశాడుట. వీడెంత ప్రయత్నించినా అయన్ను కన్విన్స్ చేయలేకపోయాడుట.

"మన ప్రయత్నాలు మళ్ళీ మొదటికొచ్చాయి" అన్నాడు వాడు బాధగా.

వాణ్ణి చూస్తుంటే నాకు ముగ్గురు వ్యక్తులు గుర్తుకొచ్చారు. ఒకడు నాకు జోస్యం చెప్పిన కోయవాడు, రెండు మా అన్నయ్య, మూడు బీచిలో బిచ్చగాడు. వీళ్ళు ముగ్గురూ సైకాలజీ చదువు కోలేదు. కానీ వీళ్ళు ఎదుటి వారి మనసులు చదివి అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా తమ ప్రవర్తనను మార్చుకుంటూ జీవితం గడుపుతున్నారు. సైకాలజీయే వారికి బ్రతుకుతెరువుగా ఉంటోంది. కానీ సైకాలజీలో వారికి ఏ డిగ్రీ లేదు. సైకాలజీలో డిగ్రీ ఉన్న రంగనాథం ఆ సబ్జక్టును తన ప్రయోజనానికుపయోగించు కోలేకపోతున్నాడు. కనీసం అతను ఇతరులను ఇంప్రెస్ చేసి ఉద్యోగం సంపాదించలేక పోతున్నాడు. అతను చదువుకున్న సైకాలజీ సబ్జక్టు అతని జీవనోపాధికేవిధంగానూ ఉపయోగపడలేక పోతోంది.

దీన్ని బట్టి ఏమనుకోవాలి? లోపం వ్యక్తులదా? చదువుదా? ఈ వ్యవస్థదా?

చదువుకున్న చదువును జీవనోపాధికి ఉపయోగించుకోలేని అసమర్థత మాత్రం - ఈ కాలపు చదువుల ప్రత్యేకత అని చెప్పక తప్పదు. ★

*(విజయ మాస పత్రిక - మే, 1980)*